జిల్లా నిఘా కమిటీ సభ్యుల నియామకానికి దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి -పాడేరు :జిల్లాలో నిఘా కమిటీ సభ్యుల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి జి. జనార్ధనరావు మంగళవారం ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టరు ఎఎస్ దినేష్‌కుమార్ ఆదేశాల మేరకు స్కావెంజర్ల (సపాయి కర్మాచారి) పునరావాస చట్టం, 2013 అమలులో భాగంగా ఒక మహిళతోకూడిన నలుగురు సభ్యులతో జిల్లా నిఘా కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సఫాయి కర్మచారి, పారిశుధ్య కార్మికుల కోసం పనిచేస్తున్న అల్లూరి జిల్లా నివాసితులైన స్వచ్ఛంద సంస్థలు, ఇతర ప్రతినిధుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు వెల్లడించారు.

జిల్లా నిఘా కమిటీ సభ్యులుగా దరఖాస్తు చేసుకునే సంబంధిత అర్హతలు, ఆధారాలతో ఫొటో జతపరిచిన దరఖాస్తులను జిల్లా షెడ్యూల్డ్ కుల సంక్షేమ, సాధికారిత అధికారి కార్యాలయంలో వచ్చేనెల 2లోగా సమర్పించాలని, పూర్తి వివరాలకు 70364 08143 నంబర్లో సంప్రదించాలని కోరారు.

నర్సరీ మాఫియాలపై క్రిమినల్ చర్యలు

ఉపాధి హామీ పథకంలో మొక్కల పెంపకానికి అధిక ప్రాధాన్యత

వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక పక్కాగా అమలుకు ఆదేశం

ఎంపిడిఒలతో ప్రతివారమూ సమీక్ష : జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి -పాడేరు : కడియం నర్సరీలు మాఫియాగా తయారయ్యాయని, మొక్కలను సరిగా సరఫరా చేయడం లేదనిజిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ మండిపడ్డారు కడియం నుండి మొక్కల సరఫరా సరిగా లేకపోవడంతో వచ్చే ఏడాది వారి నుంచి మొక్కలు కొనేది లేదని, అవసరమైతే వారిపై క్రిమినల్ కేసులు పెడతామని స్పష్టం చేశారు. ఉపాధి హామీ పథకంలో మొక్కల పెంపకానికి అధిక ప్రాధాన్యత నివ్వాలని, నర్సరీల నుండి సకాలంలో మొక్కలు సరఫరా జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి ఎంపిడిఒలతో మండలస్థాయి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ . ఈ నేపథ్యంలో స్థానికంగానే నర్సరీలు ఏర్పాటు చేయడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారులను ఆదేశించారు. స్థానిక రైతులను గుర్తించి, వారికి శిక్షణనిచ్చి నర్సరీలను ఏర్పాటు చేయాలని సూచించారు. రంపచోడవరం డివిజన్ పరిధిలో రబ్బర్ ప్లాంటేషన్‌కు అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని, ఇతర రాష్ట్రాల నుండి కూడా రబ్బరు మొక్కలు తెప్పించడానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రానున్న వారంలోగా పూర్తిస్థాయిలో మొక్కలు నాటడం పూర్తి చేయాలన్నారు. ఉపాధి హామీ పథకంలో మాన్ డేస్ సూచించారు. ఐటిడిఎ పిఒలు ఎన్ఆర్ఈజీఎస్‌కు సంబంధించి క్షేత్రస్థాయి తనిఖీలు నిర్వహించి తగు సూచనలు చేయాలని ఆదేశించారు. చెరువులు, ట్యాంక్ బండ్లు, వాటర్ హార్వెస్టింగ్, సోక్ పిట్లు ఏర్పాటు చేయాలన్నారు. వందరోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా వ్యర్థాల తొలగింపు, కాలువలలో పూడికతీత, ఘన వ్యర్ధ పదార్థాల నిర్వహణ గూర్చి ఆరా తీసిన కలెక్టర్ అసంతప్తి వ్యక్తం చేశారు. ఇంటివద్దనే తడి పొడి చెత్తను వేరు చేయాలని, లేకుంటే డంపింగ్ యార్డ్ దగ్గరైనా చేయాలని సూచించారు. చెత్తను సేంద్రీయ, రసాయన ఎరువుల తయారీని నాణ్యవంతంగా పూర్తి చేయాలని సూచించారు. చింతపల్లి పాడేరు అరకు లంబసింగిలో ప్లాస్టిక్ వ్యర్థాల నియంత్రణకు చర్యలు చేపట్టాలని ఐటీడీఏ పిఓలను ఆదేశించారు. యాంటీ లార్వాలు ఆపరేషన్స్, వాటర్ టెస్టింగ్ నిర్వహించాలని మలేరియా మరణాలు సంభవిస్తే సహించేది లేదని హెచ్చరించారు. వంద రోజులలో బ్యాంకు లింకేజీల లక్ష్యసాధనలో వెనుకబాటుపై ఆరా తీసిన కలెక్టర్, చేపడుతున్న చర్యలపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.వివోలు సీసీలు ఎవరైనా తప్పు చేసినట్లు దృష్టికి వస్తే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు . ఓటర్ల జాబితా సవరణకు బిఎల్ఒలు సరిగా స్పందించడం లేదని ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో ఎంపిడిఒలు సమీక్ష నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. ఫారం 6,7,8 లను తప్పనిసరిగా వినియోగించాలన్నారు. ఎంపిడిఒలంతా వారానికి ఒకసారి మండల స్థాయిలో సమీక్షలు నిర్వహించి సంబంధిత ఆర్‌టిడిఎ ప్రాజెక్టు అధికారుల ద్వారా తనకు రిపోర్టులు పంపించాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ లో ఐటిడిఎ పిఒలు వి అభిషేక్ కట్టా సింహాచలం, డిఆర్‌డిఎ పిడి మురళి, డ్వామా పిడి శివయ్య, డిపిఒ కొండలరావు, ఎంపిడిఒలు, ఎపిఎంలు పాల్గొన్నారు

అనారోగ్యంతో కెజిబివి విద్యార్థిని మృతి

పాఠశాల సిబ్బంది నిర్లక్ష్యమే కారణమంటున్న తల్లిదండ్రులు

ప్రజాశక్తి- చింతూరు

స్థానిక కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో 7వ తరగతి చదువుతున్న శ్యామల లక్ష్మీపార్వతి (12) అనారోగ్యంతో సోమవారం రాత్రి భద్రాచలం ఆసుపత్రిలో మృతి చెందింది. పాఠశాల సిబ్బంది నిర్లక్ష్యం వల్లే తమ కుమార్తె మృతి చెందినట్లు లక్ష్మీపార్వతి తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. దీనికి సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి... మండలంలోని కొమరు పంచాయతీ మామిలగూడెం గ్రామానికి చెందిన శ్యామల లక్ష్మీపార్వతి (12) కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో ఏడవ తరగతి చదువుతోంది. లక్ష్మీపార్వతి అనారోగ్యంతో ఉందని ఆమె అత్త కూతురు అయిన మరో విద్యార్థిని లక్ష్మీపార్వతి తల్లి రాములమ్మకు శనివారం సాయంత్రం ఫోన్ ద్వారా సమాచారం అందజేసింది. దీంతో ఆమె ఆదివారం ఉదయం కస్తూరిబా పాఠశాలకు చేరుకుని, తమ కుమార్తెను తనతో పాటు పంపించాలని కోరింది. దీనికి ఇన్‌ఛార్జి అంగీకరించలేదు. ఆమె వాదించటంతో చివరికి పంపించారు. దీంతో రాములమ్మ తన కుమార్తెను నేరుగా చింతూరు ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్యులకు చూపించింది. ఆయాసం వస్తుందని, పరిస్థితి బాగాలేదని భద్రాచలం తరలించాలని వైద్యులు సూచించారు. అందుకు సిద్ధంగా లేని తల్లి తన స్వగ్రామానికి కుమార్తెను తీసుకొని వెళ్లిపోయింది. అదే రోజు సాయంత్రం మరోసారి చింతూరు ఆస్పత్రికి కుమార్తెను తీసుకొచ్చింది. పరీక్షించిన డాక్టర్లు పరిస్థితి విషమంగా ఉండడంతో రాత్రి సమయంలో 108 వాహనంలో భద్రాచలం తరలించారు. సోమవారం ఉదయం పరీక్షలు చేసిన వైద్యులు లక్ష్మీపార్వతిని ఐసీయూలో పెట్టి చికిత్స అందించారు. అయితే పరిస్థితి విషమించి సోమవారం రాత్రి లక్ష్మీపార్వతి మృతి చెందింది. దీంతో తల్లిదండ్రులు బోరున విలపించారు. కంటికి రెప్పలా చూసుకొనే తమ కుమార్తెను బంగారు భవిష్యత్తు కోసం పాఠశాలలో చేర్పిస్తే ఇలా తమ కళ్ళ ఎదుటే కన్నుమూసిందని తల్లిదండ్రులు గుండెల పగిలేలా విలపించారు. పాఠశాల సిబ్బంది సమయానికి వైద్యం అందించకపోవడంతోనే తమ కుమార్తె ఆరోగ్య పరిస్థితి విషమించిందని, సిబ్బంది నిర్లక్ష్యమే తమ కుమార్తె మృతికి కారణమని తల్లిదండ్రులు ఆరోపించారు.

లక్ష్మీపార్వతి (ఫైల్‌ఫొటో)

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

అనారోగ్యంతో మృతి చెందిన లక్ష్మీపార్వతి కుటుంబానికి జమాల్ ఖాన్ చారిటబుల్ ట్రస్ట్ తరుపున మంగళవారం రూ.5000 ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా జమాల్‌ఖాన్ మాట్లాడుతూ పాఠశాలల్లో పిల్లల ఆరోగ్య పరిస్థితి ఎప్పటికప్పుడు తల్లిదండ్రులు పర్యవేక్షిస్తూ ఉండాలన్నారు. ముఖ్యంగా ఆడపిల్లల ఆరోగ్యం విషయంలో తల్లిదండ్రులు, పాఠశాల సిబ్బంది దృష్టి సారించాలని కోరారు.

డ్రైయినేజీ నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి -అనంతగిరి : మండలంలోని టోకూరు పంచాయతీ కేంద్రంలో ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాల వద్ద డ్రైనేజీ నిర్మాణ పనులకు మంగళవారం స్థానిక సర్పంచ్ కిల్లో మొస్య ఆధ్వర్యంలో జెడ్‌పిటిసి దీసరి గంగరాజు శంకుస్థాపన చేశారు. డ్రైనేజీ నిర్మాణానికి జిల్లా పరిషత్ నిధుల నుంచి జెడ్‌పిటిసి గంగరాజు చొరవతో రూ.7.50లక్షలను మంజూరు చేశారు.

ఈ సదంర్భంగా జెడ్‌పిటిసి గంగరాజు మాట్లాడుతూ, టోకూరు బాలికల ఆశ్రమపాఠశాల విద్యార్థినులు మురుగు కాలువ లేకపోవడంతో దుర్గంధంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయాన్ని సర్పంచ్‌తోపాటు స్థానికులు తన దృష్టికి తేవడంతోపాటు స్వయంగా ఇక్కడ పరిస్థితులను పరిశీలించిన తాను జిల్లా పరిషత్ నుంచి నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. పనులను నాణ్యతతో చేపట్టి, సకాలంలో పూర్తిచేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. కాగా టోకూరులో అభివృద్ధి పనులకు జిల్లా పరిషత్ నిధులను కేటాయించిన జెడ్‌పిటిసి దీసరి గంగరాజుకు గ్రామప్రజలు, ఆశ్రమ పాఠశాల విద్యార్థినుల తరపున సర్పంచ్ కిల్లో మొస్య ధన్యవాదాలు తెలిపారు. పంచాయతీ అభివృద్ధికు మరింత నిధులు కేటాయించి సహకరించాలని కోరారు కార్యక్రమంలో వైస్‌సర్పంచ్ జి, నర్సన్న వార్డు సభ్యులు పాంగి, లక్ష్మణరావు, ప్రసాద్, మాజీ సర్పంచ్ ఎస్,దొన్ను, సిపిఎం మండల కార్యదర్శి ఎస్, నాగులు మండల నాయకులు జి.దేవన్న, కార్యకర్తలు టిడిపి మండల నాయకులు ఎస్.దోన్ను సచివాలయం సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు

సర్పంచ్ మొస్యతో కలిసి శంకుస్థాపన చేస్తున్న జెడ్‌పిటిసి గంగరాజు

ఎన్నికల హామీలు అమలు చేయాలి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం

ప్రజాశక్తి-విఆర్.పురం

రాష్ట్ర ప్రజలకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని రామవరంలో మంగళవారం జరిగిన సిపిఎం విఆర్.పురం, చింతూరు మండలాలకు చెందిన ఆగ్జలరీ సభ్యుల శిక్షణా తరగతుల్లో సీతారాం మాట్లాడుతూ ప్రస్తుత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాధినేతలు అధికారం కోసం ఎన్నికల్లో అనేక హామీలు ఇచ్చారని, నేడు ఆ హామీలను అమలు చేయటంలో చిత్తశుద్ధి కనబర్చడం లేదని విమర్శించారు. రాష్ట్రంలో టిడిపి కూటమి చెప్పిన సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలని, లేదంటే ప్రజా ఉద్యమాల సెగ తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విఆర్.పురం ఎంపీపీ కారం లక్ష్మి, సిపిఎం జిల్లా నాయకులు పూనెం సత్యనారాయణ, రెండు మండలాల కార్యదర్శులు సోయం చినబాబు, సీసం సురేష్, నాయకులు పులి సంతోష్ కుమార్, కారం సుందరయ్య, పొడియం లక్ష్మణ్, పులి బొజ్జి, బాలరాజు, వడ్లాది రమేష్, కంజ నాగిరెడ్డి, కారం నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం

సిఆర్‌టిలందరినీ రెన్యువల్ చేయాలి

- సిఐటియు నేతలు వాణిశ్రీ, వెంకట్

ప్రజాశక్తి-రంపచోడవరం

రంపచోడవరం, చింతూరు ఐటిడిఎల పరిధిలో గిరిజన ఆశ్రమ, ప్రాథమిక పాఠశాలలో పది సంవత్సరాల నుండి పని చేస్తున్న కాంట్రాక్టు రెసిడెన్షియల్ టీచర్స్ (సిఆర్‌టి)లు అందరినీ రెన్యువల్ చేయాలని సిఐటియు ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మట్ల వాణిశ్రీ, పల్లపు వెంకట్ మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రంపచోడవరం కేంద్రంగా మంగళవారం కౌన్సెలింగ్ అని చెప్పి సిఆర్‌టిలందరినీ పిలిచి కొంతమంది మాత్రమే రెన్యువల్ చెస్తామని చెప్పడం దారుణమన్నారు. స్కూల్ అసిస్టెంట్ల ప్రమోషన్స్ వల్ల స్కూల్ అసిస్టెంట్లుగా ఉన్న సిఆర్‌టిలకు ఖాళీ పోస్టులు లేవని, అందువల్లే ఆపుతున్నామని ఐటిడిఎ పిఒ చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. స్కూల్ అసిస్టెంట్ పోస్టులు లేకపోయినా, ఎస్‌జిటి పోస్టు ఖాళీలు ఉన్నాయని తెలిపారు. రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ నుండి, ఫైనాన్స్ డిపార్ట్మెంట్ నుండి మొత్తం అందరికీ రెన్యువల్ ఆర్డర్ వచ్చినప్పటికీ కౌన్సిలింగ్ పేరుతోటి పదేళ్లగా పని చేస్తున్న వారిని ఇలా అర్ధాంతరంగా నిలుపుదల చేయడం దుర్మార్గమన్నారు. గత పదేళ్ల నుండి గిరిజన విద్యార్థులకు మంచి విద్యను అందించే దాంట్లో సిఆర్‌టిలు కూడా భాగస్వామ్యం అవుతున్నారని, అటువంటి వారిని ఇప్పుడు తొలగించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. పిఒ తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకొని రాష్ట్రవ్యాప్తంగా చేసినట్లే రంపచోడవరం నియోజకవర్గంలోని 11 మండలాల్లో ఉన్న 323 మందిని తక్షణమే రెన్యువల్ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సిఆర్‌టిల పోరాటానికి సిఐటియు అండగా ఉంటుందని స్పష్టం చేశారు.

కస్తూర్బా విద్యాలయాన్ని సందర్శించిన ఎమ్మెల్యే

విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు

ప్రజాశక్తి-పాడేరు : జిల్లా కేంద్రంలోని లగిసపల్లి గ్రామ సమీపంలో ఉన్న కస్తూర్బాగాంధీ విద్యాలయాన్ని మంగళవారం ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు ఆకస్మికంగా సందర్శించారు పాఠశాలలో తరగతి గదులకు వెళ్లి విద్యార్థులతో ముచ్చటించారు. వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. విద్యా బోధన, తరగతుల నిర్వహణను పరిశీలించారు. పదవ తరగతి గదిలోకి వెళ్లి, విద్యార్థినులను పలకరించి ఎమ్మెల్యే, వారి పబ్లిక్ పరీక్షల సన్నద్ధతపై ఆరా తీశారు. బాలికలంతా బాగా చదువుకోవాలని, టెన్త్ పబ్లిక్ పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని సూచించారు ఈ ఏడాది పాఠశాలలో అత్యధిక మార్కులు సాధించే విద్యార్థినికి తనవంతుగా రూ.10వేలు ఆర్థిక ప్రోత్సాహక బహుమతిగా అందజేస్తానని ఎమ్మెల్యే ప్రకటించారు.విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని, మెరుగైన విద్య బోధన చేయాలని పాఠశాల యాజమాన్యాన్ని సూచించారు. అనంతరం పాఠశాల రికార్డులను పరిశీలించారు.

నేత్రదానంపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: నేత్రదానంతో అంధులైన ఇతరులకు కంటిచూపు ప్రసాదించడంతోపాటు మరణానంతరం కూడా లోకాన్ని చూసే భాగ్యం దక్కుతుందని వైద్యాధికారి పి.రాంబాబు అన్నారు. మంగళవారం జాతీయ నేత్రదాన పక్షోత్సవాలను పురస్కరించుకొని స్థానిక పిహెచ్‌సి వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి హైవేలోని మూడురోడ్ల జంక్షన్ మీదుగా బిఎస్ఎన్ఎల్ టవర్ వరకు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా డాక్టర్ రాంబాబు మాట్లాడుతూ, సాదారణ మరణాలతోపాటు ప్రమాదవశాత్తు చనిపోయిన వారు,బ్రెయిన్‌డెడ్ అయిన రోగులు తమ కళ్లను దానం చేసి, వేరొకరికి కంటి వెలుగులు ప్రసాదించే అవకాశం ఉందన్నారు. వయస్సుతో సంబంధం లేకుండా ప్రతిఒక్కరూ నేత్రదానం చేయవచ్చుని సూచించారు. ఎంపిహెచ్ఇఒ శౌరి, వైద్యసిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ర్యాలీ చేస్తున్న వైద్యసిబ్బంది, విద్యార్థులు

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

ఏజెన్సీలో నెలకొన్న ప్రజల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి, విజయభాస్కర్ అన్నారు. మండలంలోని కిర్రాబు, లబ్బర్తి గ్రామాల్లో మంగళవారం ఎమ్మెల్యే శిరీషాదేవి విజయభాస్కర్ దంపతులు పర్యటించారు. తొలిత గ్రామ దేవతకు పూజలు నిర్వహించారు. లబ్బర్తి గ్రామంలో టిడిపి కార్యాలయాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎమ్మెల్యే దంపతులను టిడిపి నాయకులు, గ్రామస్తులు, మహిళలు ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సన్మాన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ కులమతాలకు, రాజకీయాలకు అతీతంగా ఏజెన్సీ అభివృద్ధికి కృషి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి కూటమి నాయకులు జి.పెద్దిరాజు, ముప్పన డింబకేశ్వరరావు, డి శివరామచంద్రరాజు, జి తాతారావు, బి.త్రిమూర్తులు, టి సూరిబాబు, ఎం సోమునాయుడు, ఎస్ సుబ్బారావు, ఎస్ శివ, చిట్టిబాబు పాల్గొన్నారు.

ఉపాధి హామీలో అవకతవకలకు పాల్పడితే చర్యలు

ఉపాధి హామీ పనుల్లో సిబ్బంది ఎవరైనా అవకతవకలకు పాల్పడితే అటువంటి వారిపై చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను రంపచోడవరం ఎమ్మెల్యే మిర్యాల శిరీష దేవి ఆదేశించారు. స్థానిక ఉపాధి హామీ కార్యాలయ ఆవరణలో ఎంపిపీ గోము వెంకటలక్ష్మి, ఎంపీడీవో లోకుల యాదగిరిశ్వరరావు అధ్యక్షతన మంగళవారం జరిగిన ఉపాధి హామి సోషల్ ఆడిట్ ప్రజావేదిక కార్యక్రమాన్ని ఎమ్మెల్యే మిరియాల శిరీషా దేవి విజయభాస్కర్ పర్యవేక్షించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సోషల్ ఆడిట్ గతంలా తూతూ మంత్రంగా కాకుండా పారదర్శకంగా జరగాలన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి వడుగుల జ్యోతి, స్థానిక సర్పంచ్ జిరమణి, పలు పంచాయతీల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యే శిరిషాదేవి దంపతులను సత్కరిస్తున్న మహిళలు

మ్యుటేషన్లు వేగవంతం చేయండి

వేగవంతం, పారదర్శకంగా ప్రజా ఫిర్యాదుల పరిష్కారం

వీడియో కాన్ఫరెన్స్ సమీక్షలో జాయింట్ కలెక్టర్ అభిషేక్

త్వరితగతిన పిఎసిఎస్‌ల కంప్యూటరీకరణకు ఆదేశం

వీడియో కాన్ఫరెన్స్ సమీక్షలో మాట్లాడుతున్న జెసి అభిషేక్

ప్రజాశక్తి-పాడేరు: భూలావాదేవీలకు సంబంధించి మ్యుటేషన్ల ప్రక్రియ జిల్లాలో వేగవంతం చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎంజె.అభిషేక్ తహశీల్దార్లను ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న ఆర్ఒఆర్, ఎల్‌టిఆర్, ఎల్ఎ, ఆర్అండ్ఆర్ కేసులను త్వరితగతిన పరిష్కార చర్యలు చేపట్టాలన్నారు.

మంగళవారం కలెక్టరేట్ నుంచి ఐటిడిఎ పిఒలు, సబ్ కలెక్టర్లు, తహసిల్దార్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్షించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (మీకోసం)కు అందిన ఫిర్యాదు లను సకాలంలో పారదర్శకంగా పరిష్కరించాలని తిరస్కరించాల్సి వస్తే పూర్తి కారణాలను సంబంధిత ఫిర్యాదు దారుకు తెలియజేయాలని ఆదేశించారు. ముఖ్యంగా ఎస్ఎల్ఎలను గడువులోగా పరిష్కరించాలని, ఎట్టి పరిస్థితులలోనూ బిహైండ్ ఎస్ఎల్ఎ లేకుండా చూడాలని స్పష్టం చేసారు. భూసేకరణకు అవార్డుల ప్రక్రియకు చర్యలు తీసుకోవాలని, సివిల్ డిపాజిట్స్ పరిష్కారం చేయాలని సూచించారు. వెబ్ ల్యాండ్‌లో తప్పులు సవరించాలన్నారు. ప్రతి మంగళవారం ఇటువంటి సమీక్ష ఉంటుందని, ముందుగానే పూర్తి వివరాలు సమర్పించడంతో పాటు సమీక్షలో వివరాలు స్పష్టంగా తెలియజేయాలని ఆదేశించారు. జనన మరణ ధ్రువీకరణలు, కుల, ఆదాయ, ఇతర సర్టిఫికెట్ల జారీని వేగవంతం చేసి దరఖాస్తుదారులకు ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. ఉద్యానవన మొక్కలు పంపిణీ, నాటడంపై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రతి గ్రామంలోనూ ఉపాధి హామీ పనులు కేటాయించి, జాబ్‌కార్డున్న ప్రతికుటుంబానికీ వంద రోజుల పనిదినాల కల్పనకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలలో లావాదేవీలు వేగవంతం, బలోపేతం దిశగా చేపడుతున్న కంప్యూటరీకరణ ప్రక్రియను డిసిసిబి, పిఎసిఎస్‌లు సమన్వయంతో త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డిఆర్ఓ బి.పద్మావతి, రంపచోడవరం నుంచి ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం, మండలాల నుంచితహశీల్దార్లు పాల్గొన్నారు.

రైతులు విధిగా పంట నమోదు చేసుకోవాలి

ప్రజాశక్తి-దేవీపట్నం

రైతులందరూ విధిగా పంట నమోదు చేసుకోవాలని దేవీపట్నం వ్యవసాయ శాఖ అధికారి ఆర్.ప్రశాంతి అన్నారు. మండలంలోని ఇందుకూరుపేటలో పొలాల్లో పంట నమోదును మంగళవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతు సేవా కేంద్రంలో విలేజ్ అగ్రికల్చర్, హార్టికల్చర్ అసిస్టెంట్లు పంట నమోదు చేస్తున్నారని, రైతులు తాము నాటిన ప్రతి పంటను నమోదు చేసుకోవాలని కోరారుర. పంట నమోదు చేసుకుంటే సబ్సిడీలు, పంటలకు ఏమైనా విపత్తులు ద్వారా నష్టం సంభవించిన నష్ట పరిహారానికి అర్హులవుతారని పేర్కొన్నారు. ఇప్పటివరకు 2100 ఎకరాలకు మాత్రమే పంట నమోదు చేసుకున్నారని, సెప్టెంబర్ 15వ తేదీలోపు పంట నమోదు చేయించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ రత్నాకుమర్, విలేజ్ అగ్రికల్చర్, హార్టికల్చర్ అసిస్టెంట్లు, రైతులు పాల్గొన్నారు

పంటల నమోదును పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

ప్రజాశక్తి

ఉద్యోగ విరమణ మరియు షష్టిపూర్తి శుభాకాంక్షలు

అతి తక్కువ ధరతో మీ ప్రకటన వేయబడును.

మీ సేవలు మరువలేనివి, మీరెక్కడున్నా మీ శ్రేయస్సును కోరుకుంటాం, అందించండి. ప్రజాశక్తి ద్వారా శుభాకాంక్షలు

మీ సహోద్యోగులు, మీ కుటుంబ సభ్యులు, బంధుమిత్రులలో ఎవరైనా రిటైర్ అవుతున్నారా? మరియు షష్టిపూర్తి మహోత్సవ శుభాకాంక్షలు తెలపాలనుకుంటున్నారా? అయితే అందించండి వారికి అభినందన కుసుమాలు, ఆకాంక్షించండి వారి సుఖమయ జీవితాన్ని ప్రజాశక్తి ద్వారా తెలియజేయండి.

ఉద్యోగ విరమణ

షష్టిపూర్తి మహోత్సవ శుభాకాంక్షలు

మరిన్ని వివరాలకు మా స్థానిక ప్రతినిధులను సంప్రదించండి

సిటీ : 9490099125
మధురవాడ : 8008596645
గాజువాక : 9849392359
అనకాపల్లి : 8008736188
చోడవరం : 9490099141
నర్సీపట్నం : 9440280411
పాడేరు : 9490099142
పూర్ణమార్కెట్ : 9490099676
జగదాంబ : 9490099434
జివియంసి : 9490099483
ద్వారకానగర్ : 9490099672
కంచరపాలెం : 9490099135
మాదవధార : 9490099675

దేగలపుట్టులో తాగునీటి సమస్యను పరిష్కరించండి

ప్రజాశక్తి -ముంచింగిపుట్టు : మండలంలోని జర్రెల పంచాయతీ దేగలపుట్టు గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని కూటమి నేతలు డిమాండ్ చేశారు.గతవారం గ్రామంలో నెలకొన్న తీవ్రతాగునీటి ఎద్దడిపై గ్రామస్తులు బురిడి సర్పంచ్, పరమేష్, లోతో, లక్ష్మి, సుమిత్ర, పద్మ తదితరులు జనసేన మండల అధ్యక్షుడు రెయ్యల శ్రావణ్‌కుమార్‌కు ఫిర్యాదు చేయగా, దానిపై స్పందించిన నేతలు మంగళవారం దేగలపుట్టు చేరుకుని తాగునీటి సమస్యపై పరిశీలన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామంలో తాగునీటికి రెండు బావులున్నప్పటికీ, గడచిన ఐదేళ్లుగా వీటిని పట్టించుకోకపోవడంతో బురదనీరు, వేసవిలో అడుగంటిపోయి గ్రామంలో తాగునీటికి కారణమౌతోందని ఆరోపించారు. బావుల మరమ్మతులకు పంచాయతీ నిధులు ఉన్నప్పటికీ, స్థానిక సర్పంచ్ బొంగు భాగ్యవతి చొరవ చూపకపోవడమే నీటిఎద్దడికి కారణమని మండిపడ్డారు. అంతేకాక దేగలపుట్టు గ్రామంలో జలజీవన్ మిషన్ కింద ఇంటింటా కుళాయి ఏర్పాటుకు రూ.7.49 లక్షలు మంజూరైనప్పటికీ, పనులు చేయించడంలో సర్పంచ్ చొరవ చూపకపోవడం ఈ పరిస్థితికి కారణమన్నారు. గడచిన ఐదేళ్లలో గ్రామాల్లో ప్రజల సమస్యలు, అభివృద్ధి పనులపై వైసిపి ప్రభుత్వం పూర్తిగానిర్లక్ష్యం చేయడం కూడా ఈ పరిస్థితికి కారణమని మండిపడ్డారు. పంచాయతీలో నిధులున్న నేపథ్యంలో తక్షణమే బావులు బాగుచేయించడంతోపాటు, జలజీవన్ మిషన్ పనులు కొనసాగేలా స్థానిక సర్పంచ్ చొరవ తీసుకోవాలని కోరారు.కార్యక్రమంలో జనసేన మండల ఉపాధ్యక్షుడు మట్టం సూర్య నారాయణ, ప్రధాన కార్యదర్శి జి సతీష్‌కుమార్, టిడిపి క్లస్టర్ ఇన్‌చార్జి మజ్జి చిన్నబాబు పాల్గొన్నారు.

నోట్ బుక్స్ పంపిణీ చేస్తున్న ఆదివాసీ గిరిజన సంఘం నేతలు

విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: మండలంలోని బొండం పంచాయతీ రంపుడువలస, మజ్జివలస, బొండం పాఠశాలలోని80 మంది విద్యార్థులకు దాతల ఆర్థిక సహాయంతో ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఒక్కొక్కరికి 5 నోట్‌బుక్స్ చొప్పున ఆదివాసీ గిరిజన సంఘం మండల అధ్యక్షులు, సుంకరమెట్ట సర్పంచ్ గెమ్మెలి చిన్నబాబు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ నిరు పేద గిరిజన విద్యార్థులు నోట్ బుక్స్ కొనుక్కోవడానికి ఆర్థిక స్తోమత లేని పరిస్థితుల్లో దాతల సాయంతో వారికి నోట్‌బుక్స్‌ను సమకూర్చామన్నారు. గిరిజన విద్యార్థులంతా చెడు వ్యసనాల వైపు వెళ్లకుండా చక్కగా చదువు కొని ఉన్నతవిద్యావంతుల అభ్యసించి, భవిష్యత్తును బంగారుమయం చేసుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం మండల కార్యదర్శి గత్తుం బుజ్జి బాబు, మండల నాయకులు కె అప్పన్న, కిల్లో బుజ్జిబాబు, జి సత్యారావు, జి వెంకటరమణ, రంపుడు వలస, మజ్జివలస, బొండం పాఠశాల ఉపాధ్యాయులు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు

ముడసర్లోవ పార్కులో షూటింగ్‌కు సన్నాహాలు

ప్రజాశక్తి - ఆరిలోవ : సూపర్‌స్టార్ రజనీకాంత్ సినిమా షూటింగ్ నేపథ్యంలో ముడసర్లోవ పార్కులో సన్నాహాలు చేస్తున్నారు. దీనిలో భాగంగా మంగళవారం ముడసర్లోవ పార్కులో శిలువలతో కూడిన క్రిస్టియన్ సమాధులు తయారు చేస్తున్నారు. సుమారు 50 మంది కార్మికులు సమాధుల తయారీలో నిమగ్నమయ్యారు. ఈ నెల 29 నుంచి ఇక్కడ కొన్ని సన్నివేశాలు చిత్రీకరించనున్నట్లు సమాచారం.

ఆశా, సిహెచ్‌డబ్ల్యుల సమస్యలపై ...

3న పిహెచ్‌సిల వద్ద ధర్నా

ప్రజాశక్తి -పాడేరు: ఆశా వర్కర్లు, సామాజిక ఆరోగ్య కార్యకర్తలు (సిహెచ్‌డబ్ల్యులు) సమస్యలపై వచ్చేనెల 3న ఆశా డే రోజున అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వద్ద ధర్నా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు సిఐటియు జిల్లా అధ్యక్షుడు బోంగిరి చిన్నయ్యపడాల్ తెలిపారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ తమ సమస్యల పరిష్కారం కోసం ఆశావర్కర్లు సిహెచ్‌డబ్ల్యులు సంఘటితంగా ఈ ధర్నాలో పాల్గొని, విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సిహెచ్‌డబ్ల్యుల సంఘం అల్లూరి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పద్మ, దాసమ్మ మాట్లాడుతూ సిహెచ్‌డబ్ల్యులను ఆశాలుగా గుర్తించాలని, ఆశ వర్కర్లతో సమానంగా వేతనం ఇవ్వాలని కొన్నేళ్లుగా తాము వివిధరూపాల్లో పోరాటాలు చేస్తున్నా ప్రభుత్వాలు స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. టిడిపి కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇటీవల పాడేరులో పర్యటించిన గిరిజన సంక్షేమశాఖ మంత్రి సంధ్యారాణికి సమస్యలపై వినతిపత్రం ఇచ్చామన్నారు. ప్రస్తుత ప్రభుత్వమైనా వెంటనే స్పందించి తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

సిహెచ్‌డబ్ల్యుల జిల్లా కమిటీ నూతన కార్యవర్గం

సిహెచ్‌డబ్ల్యుల జిల్లా కమిటీ నూతనకార్యవర్గాన్ని పాడేరు సిఐటియు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఏకగ్రీవంగా ఏర్పాటు చేశారు అధ్యక్షురాలిగా పద్మ, ప్రధాన కార్యదర్శిగా దాసమ్మ కోశాధికారిగా సరస్వతి, జిల్లా ఉపాధ్యక్షులుగా శేషు, పార్వతమ్మ, లక్ష్మి, భవాని, సహాయ కార్యదర్శులుగా వరలక్ష్మి, అప్పలమ్మ,నిర్మల, పావనితోపాటు మరికొంత మందిని కమిటీ కార్యవర్గసభ్యులుగా నియమించారు.

సిహెచ్‌డబ్ల్యుల జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పద్మ, దాసమ్మ

ఆర్‌బిఐ ఆన్‌లైన్ క్విజ్‌లో పాల్గొనండి

ప్రజాశక్తి -పాడేరు :- భారతీయ రిజర్వ్ బ్యాంక్ నిర్వహిస్తున్న ఆర్‌బిఐ 90 ఆన్‌లైన్ క్విజ్‌లో 25 ఏళ్ల లోపు జిల్లా విద్యార్థులందరూ పాల్గొని బహుమతులు సాధించాలని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ విద్యార్థులకు సూచించారు. మంగళవారం కలెక్టర్ ఛాంబర్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో దీనికి సంబంధించిన పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, 1935 నుండి తన కార్యకలాపాలను ప్రారంభించిన ఆర్‌బిఐ 90 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా ఈ ఆన్‌లైన్ క్విజ్ నిర్వహిస్తోందన్నారు. డిగ్రీ అండర్ గ్రాడ్యుయేట్లు పాల్గొనవచ్చన్నారు. ప్రతి టీమ్‌కు ఇద్దరు విద్యార్థులు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని, క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి వాళ్ళ కాలేజీ పేరు, వాళ్ళ పేర్లు నమోదు చేసుకొని రిజిస్టర్ అవ్వాలని సూచించారు. రిజిస్ట్రేషన్లు ప్రారంభమయ్యాయని, సెప్టెంబర్ 15వ తేదీ వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని సూచించారు. మొత్తం నాలుగు రౌండ్లు ఉంటాయని, ఆన్‌లైన్ రౌండ్‌లో బాగా రాణిస్తే రాష్ట్రస్థాయి రౌండ్, జోనల్ స్థాయి రౌండ్, జాతీయస్థాయి రౌండ్ ఉంటాయన్నారు. రాష్ట్ర స్థాయి రౌండ్‌లో మొదటి బహుమతిగా రూ.రెండు లక్షలు, రెండవ బహుమతిగా రూ.1.5 లక్షలు, మూడవ బహుమతిగా రూకలు లక్ష ఇస్తారన్నారు. జోనల్ స్థాయిలో ప్రథమ బహుమతి కింద రూ.5లక్షలు, రెండవ బహుమతిగా రూ. 4లక్షలు మూడవ బహుమతిగా రూ.3 లక్షలు ఉంటుందని, చివరగా, జాతీయ స్థాయిలో గెలుపొందిన వారికి మొదటి బహుమతి కింద రూ.10లక్షలు రెండవ బహుమతికింద రూ.8 లక్షలు, మూడో బహుమతి కింద రూ.ఆరు లక్షలు ఇస్తారని కలెక్టర్ వివరించారు. జిల్లాలో ఉన్న అన్ని డిగ్రీ కాలేజీలు, పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు పాల్గొనాలని కలెక్టర్ కోరారు. కార్యక్రమంలో ఎల్‌డిఎం పి. మాతునాయుడు, నాబార్డ్ డిడిఎం ఆర్.చక్రధర్ రావు పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

నేడు డుంబ్రిగుడ మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి -డుంబ్రిగుడ: ఈనెల 28న డుంబ్రిగుడ మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు స్థానిక ఎంపిడిఒ ఉషారాణి తెలిపారు.ఎంపిపి అధ్యక్షతన నిర్వహించే సమావేశానికి మండలంలోని జెడ్‌పిటిసిలు, ఎంపిటిసిలు, సర్పంచులు హాజరుకావాలని కోరారు. అలాగే అన్ని శాఖల మండలస్థాయి అధికారులు పూర్తి సమాచారంతో సంబంధిత రికార్డులను పట్టుకుని విధిగా సమావేశానికి హాజరు కావాలని సూచించారు.

కంటి రోగులను పరీక్షిస్తున్న వైద్యసిబ్బంది

171 మందికి కంటి పరీక్షలు

ప్రజాశక్తి -డుంబ్రిగుడ: మండల కేంద్రంలోని డుంబ్రిగుడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హెచ్‌ఆర్‌ఎసిఎ రాష్ట్ర ఏజెన్సీ మహిళ విభాగ అధ్యక్షురాలు కె.కృష్ణకుమారి ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. విశాఖపట్నం ఎల్‌వి ప్రసాద్ కంటిఆసుపత్రి వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో 171 మంది కంటిరోగులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. వారిలో 36 మందికి అంతరకుసుమాలు ఉన్నట్లు గుర్తించి, ఐఒఎల్ ఆపరేషన్లకు రిఫర్ చేశారు.దృష్టిలోపం ఉన్న మరో 39 మందికి కళ్లద్దాలు అవసరమని నిర్ధారించారు. మిగిలిన వారి సాదారణ కంటి సమస్యలకు అవసరమైన మందుల, కంటిచుక్కలు అందజేశారు.కార్యక్రమంలో ఎల్‌వి ప్రసాద్ కంటి ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది, వైద్యాధికారి డాక్టర్ రాంబాబు, సంతోష్ పాల్గొన్నారు.

సొవ్వలో పశు వైద్యశిబిరం

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: మండలంలోని సోవ్వ పంచాయతీ కేంద్రంలో పశుసంవర్ధకశాఖ వైద్యాధికారి డాక్టర్ రాజశ్రీ ఆధ్వర్యంలో మంగళవారం మెగా పశు వైద్యశిబిరం నిర్వహించారు. వాసన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో 1700 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలను వేశారు.

పశువులకు టీకాలు వేస్తున్న వైద్య సిబ్బంది

ఈ సందర్భంగా పశువైద్యాధికారి డాక్టర్ రాజశ్రీ మాట్లాడుతూ, పశువులు, జీవాలకు సీజన్‌లో కాలిగుట్టలు, నోటికి పుండ్లు వచ్చి గాలికుంటు వ్యాధితో వాటి ఆరోగ్యక్షీణించడంతోపాటు పాల దిగుబడి తగ్గుతుందని, కొన్ని సందర్భాల్లో మరణాలు కూడా చోటుచేసుకుంటాయన్నారు. గాలికుంటు వ్యాధి రాకుండా ముందస్తుగా టీకాలు వేయించడం ద్వారా వాటిని నివారించవచ్చన్నారు. పాడిరైతులు, జీవాల పెంపకందారులు ప్రభుత్వపరంగా ఉచితంగా ఇస్తున్న గాలికుంటు వ్యాధి టీకాలను తమ మూగజీవాలకు వేయించాలని సూచించారు. ఈ సందర్భంగా కొన్ని పశువులు, గొర్రెలు, మేకలకు వైద్యసేవలు, మందులు అందించారు.కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది సంజీవ్, త్రినాధరావు, మనోజ్‌కుమార్, రమేష్, జయరాజు, వాసన్ సంస్థ ప్రతినిధులు నరసింహరావు, రఘు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతకు అభినందన

ప్రజాశక్తి - అరకులోయ రూరల్: మన్యంలోని ఆదివాసీ గిరిజనులకు అందిస్తున్న సేవలకు గుర్తింపుగా మదర్ థెరిసా జయంతిని పురస్కరించుకుని ఉత్తమ సామాజిక సేవా పురస్కారాన్ని అందుకున్న ఆదివాసీ పరిరక్షణ సమితి అధ్యక్షుడు, అరకులోయ మండలానికి చెందిన చట్టుమోహన్‌ను మంగళవారం అభినందించారు. విశాఖ ద్వారకానగర్‌లోని పౌరగ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో చట్టుమోహన్ అవార్డును స్వీకరించారు. మంగళవారం చేయూత సామాజిక సేవా సంస్థ, డే స్ప్రింగ్ ఇంటర్నేషనల్ యూనివర్శిటీ యూఎస్ఏ, ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన భారతరత్న మదర్ థెరిసా మదర్ జయంతి సందర్భంగా చట్టు మోహన్‌ను అభినందించారు.

అవార్డు గ్రహీతను సన్మానిస్తున్న సంస్థ ప్రతినిధులు

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

5న ఆందోళనలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-సీలేరు : యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా సెప్టెంబర్ 5న తలపెట్టిన ఆందోళనన కార్యక్రమాలను జయప్రదం చేయాలని యూనియన్ సీలేరు బ్రాంచ్ అధ్యక్షుడు బి.లక్ష్మణ్, కార్యదర్శి విష్ణుకుమార్, గౌరవ అధ్యక్షులు ఎస్కే సుభాన్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆందోళన కార్యక్రమం పోస్టర్, కరపత్రాలను మంగళవారం సీలేరు సిఐటియు కార్యాలయం వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంట్రాక్ట్ కార్మికులను తక్షణమే రెగ్యులర్ చేయాలని, 2022 వేతనాల ఏరియర్స్ చెల్లించాలని, మీటర్ రీడర్, పీస్ రేట్ కార్మికులు, స్టోర్ హమాలీలు, బిల్ కలెక్టర్లు, ఏపీ జెన్కోలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించి, ఏస్కో అకౌంట్ ద్వారా నేరుగా వేతనాలు చెల్లించాలని, కార్మికులకు ఫెయిడ్ హాలీడేలు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ప్రతి సబ్ స్టేషన్‌లో వాచ్మెన్ నియమించాలని, పెండింగ్లో ఉన్న కారుణ్య నియామకాలు చేపట్టాలని, జెన్కోలో పనిచేస్తున్న పీస్‌రేట్ కార్మికులకు మ్యాన్ పవర్ కింద మార్చాలని, జెన్కో ట్రాన్స్‌కో డిస్కమ్ అర్హతను బట్టి కంప్యూటర్ ఆపరేటర్లకు స్కిల్డ్, సెమీ స్కిల్డ్, హై స్కిల్డ్‌గా ప్రమోట్ చేయాలని, కార్మికులకు రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.10 లక్షల వరకు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాలని కోరారు. పై డిమాండ్ల సాధనకు రాష్ట్ర వ్యాప్తంగా ఏపీ జెన్కో, ట్రాన్స్‌కో, డిస్కంల కార్యాలయాల వద్ద ఈ ఆందోళనలు చేపట్టినట్లు చెప్పారు. సీలేరులో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయం వద్ద జరుగు ఆందోళన కార్యక్రమంలో కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ కార్మికులు భారీ ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీ జెన్కో కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు.

సైలెంట్ డీహైడ్రేషన్‌పై అవగాహన

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : గణనీయంగా పెరుగుతున్న సైలెంట్ డీహైడ్రేషన్ సమస్యను ఎదుర్కోవడానికి ద్రవాహారం, ఎలక్ట్రోలైట్ తీసుకోవడం ఎంత ముఖ్యమో తెలియజెబుతూ ప్రముఖ వైద్య నిపుణులు, ఎస్‌కె క్లినిక్స్ ఇంటర్నల్ మెడిసిన్ ఫిజీషియన్ డాక్టర్ లోకనాథ్ త్రిపాఠి, హ్యాపీ క్లినిక్‌లోని ఇంటర్నల్ మెడిసిన్ ఫిజీషియన్ డాక్టర్ ఎంవిఇ.రామానాయుడు సంయుక్తంగా బీచ్ రోడ్డులోని అంబికా సి గ్రీన్ హోటల్‌లో అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ లోకనాథ్ త్రిపాఠి మాట్లాడుతూ ప్రపంచ ఆరోగ్య సంస్థ ఒఆర్ఎస్‌తో ఎలక్ట్రోలైట్లను భర్తీ చేయగలిగినప్పటికీ డయేరియా పరిస్థితులలో డీహైడ్రేషన్ సమస్యను పరిష్కరించడానికి ఇది దోహదపడదని తెలిపిందన్నారు. అతిసారం లేని పరిస్థితులలో శక్తితో కూడిన ఎలక్ట్రోలైట్ పానీయాలు రికవరీలో కీలకపాత్ర పోషిస్తాయని తెలిపారు. విశాఖ వాతావరణంలోని మార్పుల కారణంగా సైలెంట్ డీహైడ్రేషన్ సమస్యను ఎదుర్కొంటోందన్నారు. డాక్టర్ రామానాయుడు మాట్లాడుతూ సైలెంట్ డీహైడ్రేషన్‌కు వైద్య చికిత్స అవసరమన్నారు. అవగాహన, నివారణ చర్యలతో దీనిని అధిగమించవచ్చునని తెలిపారు.

పెండింగ్ మెస్ ఛార్జీలు విడుదల చేయాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : హాస్టళ్ల పెండింగ్ మెస్, కాస్మోటిక్ ఛార్జీలను తక్షణమే విడుదల చేయాలని ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.జాన్సన్ బాబు డిమాండ్ చేశారు. ఎఐఎస్‌ఎఫ్, ఎన్ఆర్ఎ కాలేజీ విద్యార్థుల ఆధ్వర్యంలో జిల్లాలోని ప్రభుత్వ ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీ హాస్టల్ విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని, ప్రైవేట్ పీజీ విద్యార్థులకు శాపంగా మారిన జిఒ 77ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. సంఘం ప్రధాన కార్యదర్శి శివారెడ్డి, జిల్లా కార్యదర్శి ఉల్లం నాగరాజు, అధ్యక్షుడు ఎన్.శ్రీను పాల్గొన్నారు.

శిథిలమైన హర్వ్యెగూడెం పాఠశాల భవనం

కొత్త భవనం నిర్మించాలని సర్పంచ్ డిమాండ్

ప్రజాశక్తి-కూనవరం

మండలంలోని హర్వ్యెగూడెం (బురదగూడెం) పాఠశాల రేపో మాపో కూలిపోయే పరిస్థితుల్లో ఉంది. భవనం శిథిలమైన స్లాబ్, భీమ్ పైన పెచ్చులు ఊడి ప్రమాదభరితంగా ఉంది. ఫ్లోరింగ్ పూర్తిగా గోతులు పడ్డాయి. వర్షం కురిస్తే కారిపోతుంది. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ప్రాణ భయంతో బిక్కుబిక్కుమంటూ ఉంటున్నారు. భవనం శిథిలావస్థకు చేరి ఎప్పుడు కూలిపోతుందో తెలియని స్థితిలో ఉండడంతో విద్యార్థుల తల్లిదండ్రులు తమకు ఏమోవుతుందోనని భయాందోళనలు చెందుతున్నారు. పాఠశాలకు పిల్లలను పంపడానికి భయపడుతున్నారు.

ఈ పాఠశాలను మంగళవారం స్థానిక సర్పంచ్ బొగ్గా రామారావు, ఉపసర్పంచ్ నానుపల్లి హరిబాబు, వార్డ్ మెంబర్ బొగ్గా సుబ్బమ్మ, గ్రామ పెద్దలు బొగ్గా సుబ్బయ్య, గుండం బాబురావు తదితరులు సందర్శించారు. పాఠశాలను పరిశీలించి శిథిల భవనంలో నిర్వహిస్తున్న తరగతులను పరిశీలించి తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ బొగ్గా రామారావు మాట్లాడుతూ పాఠశాల పరిస్థితి చూస్తే ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితుల్లో ఉందని, అయినా కొత్త భవనం నిర్మాణానికి అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కొత్త భవనం నిర్మించాలని అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా వారిలో చలనం లేదన్నారు. పాఠశాల స్థితిని కొన్ని రోజుల క్రితం ఒక అధికారికి తెలియజెస్తే ఈ పాఠశాల గాని, ఈ గ్రామం గాని మ్యాప్ లో చూపించడం లేదని చెప్పినట్లు పేర్కొన్నారు. అంగన్వాడీ పరిస్థితి కూడా ఇలాగే ఉందన్నారు. ఇప్పటికైనా జిల్లా, డివిజన్ ఉన్నతాధికారులు స్పందించి పాఠశాలకు కొత్త భవనం నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

శిథిల పాఠశాల భవనంలోనే చదువుకుంటున్న విద్యార్థులు

ప్రాణసంకటంగా ఆర్ అండ్ బి రహదారులు

కూనవరం- రేఖపల్లి రోడ్డులో అడుగడుగునా పెద్ద పెద్ద గోతులు
నానా అవస్థలు పడుతున్న వాహనచోదకులు

పెద్ద పెద్ద గోతులు ఉన్న కూనవరం- రేఖపల్లి ఆర్ అండ్ బి రహదారి

ప్రజాశక్తి-విఆర్.పురం

మండలంలోని పలు ఆర్ అండ్ బి రహదారులు ప్రమాదకరంగా, ప్రాణసంకటంగా ఉన్నాయి. శబరి, గోదావరి వరదలు వచ్చి రెండు నెలలు గడిచిన వరదల వల్ల ధ్వంసమైన రహదారులకు మరమ్మతులు చేపట్టలేదు. ఆదమరిస్తే ఈ గోతుల్లో వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రధానంగా కూనవరం బ్రిడ్జి నుండి రేఖపల్లి జంక్షన్ వరకు ఉన్న రహదారిలో అడుగడుగునా పెద్ద పెద్ద గోతులు ఉండడంతో ఈ మార్గంలో వాహనాలు తిరగలేదని పరిస్థితి నెలకొంది. ఈ రహదారిలో నిత్యం పాపికొండల పర్యాటకులు రాకపోకలు సాగిస్తారు. పంట పొలాలకు వెళ్లే రైతులు, విద్యాలయాలకు వెళ్లే విద్యార్థులకు ఈ రహదారి తప్పా మరో మార్గం లేదు. దీంతో పర్యాటకులతో పాటు రైతులు, విద్యార్థులు ఈ రోడ్డు గుండా రావాలంటే నానా అవస్థలు పడుతున్నారు.

అయినా ఆర్ అండ్ బి శాఖ అధికారులు పట్టించుకోలేదన్న విమర్శలున్నాయి. గతంలో ఇదే రోడ్డుపై అనేక ప్రమాదాలు జరిగాయి. ఇప్పటికైనా ఆర్ అండ్ బి అధికారులు తక్షణమే స్పందించి రోడ్లపై ఉన్న గోతులను పూడ్చాలని, అధ్వానంగా ఉన్న రహదారులకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు, వాహనచోదకులు కోరుతున్నారు.

ఉక్కు పరిరక్షణ పోరాటాన్ని ఉధృతం చేస్తాం

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

వైజాగ్ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు పోరాటాన్ని మరింత ఉధృతం చేయనున్నట్టు విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఛైర్మన్ డి.ఆదినారాయణ స్పష్టం చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు మంగళవారానికి 1293వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో ఎఐటియుసి కార్యకర్తలు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ ఉక్కు కర్మాగారం పరిరక్షణ కోసం రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలను సమీకరించి ఉద్యమాలను చేపట్టి కేంద్ర ప్రభుత్వానికి కనువిప్పు కలిగిస్తామని తెలిపారు. ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. ఉక్కు కర్మాగారం ప్రజల సంపదని, కొల్లగొట్టే ప్రయత్నాలను కేంద్రం మానుకోవాలని అన్నారు. దీక్షల్లో నాయకులు మసేన్‌రావు, కె.రాజబాబు, జి.జయ, తాండ్ర కనకరాజు, ఎ.శివరామకృష్ణ, తుమ్మల శ్రీనివాస్, జి.ఆనంద్, కర్రి బాబూరావు పాల్గొన్నారు.

పొగరాని పొయ్యిలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ జాకబ్

పొగరాని పొయ్యిలు పంపిణీ

ప్రజాశక్తి-మారేడుమిల్లి : మారేడుమిల్లి సర్పంచ్ కొండ జాకబ్ ఆధ్వర్యంలో మంగళవారం పంచాయతీ కార్యాలయంలో క్రాప్ జోన్ ఆగ్రో ఫారెస్ట్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ వారు అందిస్తున్న పొగరాని పొయ్యిలను పంచాయతీ ప్రజలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల కోఆర్డినేటర్ గరిడే బాబురావు మాట్లాడుతూ మండలంలో సుమారు 90 శాతం గిరిజనులకు పొగరాని పొయ్యలను పంపిణీ చేయడం చేసినట్లు చెప్పారు. ఆధార్ కార్డు, రేషన్ కార్డు, కుల ధ్రువీకరణపత్రం కలిగిన ప్రతి ఒక్క గిరిజన కుటుంబానికి ఈ పొయ్యిలను ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్లు కే వీరపరెడ్డి, జి చరణ్, సుర్జిత్ పంచాయతీ ప్రజలు పాల్గొన్నారు.

జెర్రిల పిహెచ్‌సిని 30 పడకలకు అప్‌గ్రేడ్ చేయాలి

ప్రజాశక్తి-సీలేరు : జీకే వీధి మండలం జెర్రెల పిహెచ్‌సిని 30 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేసి, నూతన భవనాన్ని రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేయాలని టిడిపి జీకే వీధి మండల ప్రధాన కార్యదర్శి పి. కొండలరావు కోరారు. మంగళవారం ప్రజాశక్తితో ఆయన మాట్లాడుతూ జెర్రిల ప్రభుత్వ ఆసుపత్రిలో రోజురోజుకి రోగుల సంఖ్య విపరీతంగా పెరిగిపోతుందని, దీంతో బెడ్ల కొరత ఏర్పడి రోగులు అనేక ఇబ్బందులు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. జెర్రిల పంచాయతీ పరిధిలోని సుమారు 25 గ్రామాల ప్రజలు, ఆ పంచాయతీకి ఆనుకొని ఉన్న మొండిగెడ్డ, వంచల, కోరుకొండ పంచాయతీల ప్రజలు వైద్య సేవ నిమిత్తం జెర్రిల ప్రభుత్వ ఆసుపత్రిపై ఆధారపడి ఉన్నారని తెలిపారు. దీనిని 30 పడక ఆసుపత్రిగా తీర్చిదిద్ది కొత్త భవనాన్ని సమకూరుస్తే ప్రజలకు ఎంతో దోహదపడుతుందన్నారు. ఆసుపత్రి అభివృద్ధిపై జిల్లా కలెక్టర్ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దృష్టి సారించాలని కోరారు.

బస్టాండ్‌ను వినియోగంలోకి తెచ్చిన యువత

ప్రజాశక్తి-మారేడుమిల్లి : మారేడుమిల్లి గ్రామం పైసెంటర్‌లో నిరుపయోగంగా ఉన్న బస్టాండ్‌ను మంగళవారం కొంతమంది గిరిజన యువకులు శుభ్రం చేసి వినియోగానికి తీసుకురావడం జరిగింది. కొంతకాలంగా పశువులు స్థావరంగా ఉన్న ఈ బస్టాండు చెత్తాచెదారంతో కూడుకొని ఉంది. దీనికి చలించిన కొంతమంది యువకులు టిఎన్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర నాయకులు దూడ ప్రణీత్, ఆటో యూనియన్ నాయకులు సూర్యనారాయణ (బ్రహ్మం సూరి) ఆధ్వర్యాన కాంప్లెక్స్‌ను శుభ్రం చేసి వినియోగానికి తీసుకురావడం జరిగింది. వీరు చేసిన పనిని గ్రామస్తులు అభినందించారు. ఇటువంటి ప్రభుత్వ భవనాలను ఖాళీగా ఉంటే కొంతమంది ఇష్టానుసారంగా తమ సొంత అవసరాలకు వినియోగించుకోవడం జరుగుతుందని ఇటువంటి కబ్జాలు జరగకుండా ప్రతి ఒక్కరికి ఉపయోగపడే విధంగా ఈ పని చేశామని దూడ ప్రణీత్, సూర్యనారాయణ తెలిపారు.

సామాజిక పెన్షన్ బకాయిలు చెల్లించండి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : గత నెలలో సామాజిక పెన్షన్ తీసుకోలేని వారికి సెప్టెంబరు నెల పెన్షన్‌తో కలిపి బకాయిల చెల్లింపునకు చర్యలు తీసుకోవాలని విదసం ప్రతినిధులు మంగళవారం కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో విదశం కన్వీనర్ డాక్టర్ బూసి వెంకటరావు, ఈతలపాక సుజాత పాల్గొన్నారు.

ధనుంజయరావుకు శుభాకాంక్షలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రతిష్టాత్మక ఆంధ్ర యూనివర్సిటీకి నూతన రిజిస్ట్రార్‌గా నియమితులైన ఆచార్య ఇఎన్.ధనుంజయరావుకు ఆంధ్ర యూనివర్సిటీ కాంట్రాక్ట్ టీచర్స్ అసోసియేషన్ నాయకులు మంగళవారం శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ కోడి అర్జునుడు, డాక్టర్ ఆలీ, ట్రెజరర్ డాక్టర్ హరీష్ పాల్గొన్నారు